**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 28 జూన్, 2023.

## నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలి.
## అదాని, అంబానీ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం
## పోలవరం పోరుకేక పాదయాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజల కోసం పని చేయాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీల సేవలో తరిస్తుందని, ఈ నేపథ్యంలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం వంటి సమస్యల పరిష్కారానికి పోలవరం నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర తొమ్మిదో రోజు బుధవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ నుంచి ప్రారంభమైంది. బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీల మీదుగా జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీలకు చేరుకుని బస చేసింది. ఈ సందర్భంగా వంకావారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. నిధులు కేటాయించి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య కేవలం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న గిరిజనులు, గిరిజనేతరుల సమస్య మాత్రమే కాదని, ఇది జాతీయ సమస్య అని అన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పన, నష్టపరిహారం అందజేతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని, ప్రజలు సమస్యల కోసం పోరాడుతుంటే వారి మధ్య కులాలు, మతాల పేరుతో చీలికలు సృష్టించి పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. కేవలం నిర్వాసితులకు పునరావాసం కల్పించడమే కాకుండా ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలకు పోరాటాలు చేసే స్ఫూర్తి, తమ హక్కులను కాపాడుకునే ధైర్యం ఉందని, వారికి ఎర్రజెండా సిపిఎం అండగా నిలుస్తుందని ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలాన్ని కేంద్రం ప్రయోగశాలగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో మండలంలో గ్రామాలను ఖాళీ చేసి ఆయుధ ఫ్యాక్టరీని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అదాని ఆయుధ ఫ్యాక్టరీని మండల ప్రజలు తిప్పికొట్టాలన్నారు. జీలుగుమిల్లి మండలానికి గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. అనేక భూపోరాటాల్లో రాటుదేలిన ప్రజలు మడకంవారిగూడెంలో ఉన్నారని అభినందించారు. పోరాట యోధులంతా తిరిగి ఎర్రజెండా పట్టుకోవడం అభినందనీయమన్నారు. భూపోరాటాల మాదిరిగానే ఆయుధ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడి తమ భూములు వదలబోమని తేల్చి చెప్పాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మడకంవారిగూడెం, వంకావారిగూడెం తదితర ప్రాంతాలు నిర్వాసిత ప్రాంతాలుగా మారే అవకాశం ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షా ఐదు వేల కుటుంబాలు సర్వం కోల్పోతున్నాయని, అందుకే వారి హక్కుల కోసం ఈ నెల 20న నెల్లిపాక నుండి ప్రారంభమైన మహాపాదయాత్ర దాదాపు 170 కిలోమీటర్లు పూర్తి చేసుకుని వంకావారిగూడెం చేరుకుందన్నారు. పోలవరం నిర్వాసితులకు అంతా సంఘీభావం ప్రకటించి అండగా నిలవాలని కోరారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్‌గాని ఆయుధాల ఫ్యాక్టరీ గురించి తెలియదని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడం దారుణమన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా సమరశీల

.... 2వ పేజీ

పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభల్లో ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్, విఆర్‌పురం ఎంపిపి కె.లక్ష్మి, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కాకినాడ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, వివిధ సంఘాల నేతలు జక్కంశెట్టి సత్యనారాయణ, పివి.రామకృష్ణ, మొడియం నాగమణి తదితరులు మాట్లాడారు.

## పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోం
## 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి
## నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి దారుణం..
## పోలవరం పోరుకేక ఉప పాదయాత్ర ప్రారంభ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇళ్లు, భూములు సర్వం త్యాగం చేసిన నిర్వాసితులైన త్యాగమూర్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ఆలస్యం చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం నుండి విజయవాడ వరకు చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉప పాదయాత్రను బుధవారం పోలవరం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద వైవి జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుదేశం, కాంగ్రెస్ నాయకులు పాదయాత్రకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. పాలకులకు గిరిజనుల ఓట్లు మాత్రమే కావాలని, వారి అభివృద్ధి, సంక్షేమం పట్టదా అని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, అయితే ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల జీవితాలు ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత గ్రామాల ప్రజలంతా పునరావాస గ్రామాలకు తరలి వెళ్లడంతో పోలవరంలో సాగే వ్యాపారాలన్నీ కుంటుపడ్డాయన్నారు. రాష్ట్రంలో పాలక పార్టీలేవీ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి నిధులు ఇస్తూ.. నిర్వాసితుల పరిహారం కోసం నిధులివ్వకపోవడం దారుణమని విమర్శించారు. నిర్వాసితుల పునరావాసం కోసం కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల పోలవరం మండలంలో ముంపు గ్రామాలన్నింటినీ ఖాళీ చేయించారని, అయితే వారికి ఇస్తానన్న పరిహారం ఇవ్వలేదని అన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారం కాలేదన్నారు. పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉపాధి లేక అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితులందరికీ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాలను రీసర్వే చేయాలని కోరారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అర్హులందరికీ చెల్లించాలన్నారు. పోలవరం నిర్వాసితుల కోసం సాగిస్తున్న పోరాటంలో గిరిజన, గిరిజనేతరులు అందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పాదయాత్ర దళ నాయకులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకూ రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10.50 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలన్నారు. యువతీ యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, కాంగ్రెస్ మండల నాయకులు బొంతు వేణు పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. నిర్వాసితుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. అనంతరం పాదయాత్ర ఇటుకలకోట, వింజరం, మీదుగా కొండ్రుకోట పునరావాసం గ్రామం వరకు సాగింది. యాత్రలో సిపిఎం నేతలు తామా ముత్యాలమ్మ, బొరగం భూచంద్రరావు, సముద్రాల సాయికృష్ణ, కామా బాలరాజు, మడిమి చలపతి, కొమరం పోసిరత్నం, మిడియం గంగాదేవి పాల్గొన్నారు.

J. Jayaram

**(జె.జయరాం)**

ఆఫీసు కార్యదర్శి(2)